SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 230 ఎడిటర్ : విక్రం కుమార్ మంగళవారం 29 ఏప్రిల్ 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

## నగరం.. సుందరీకరణం

- మిస్ వరల్డ్ పోటీలకు రూ.1.79 కోట్లతో ఏర్పాట్లు

**సమయం న్యూస్, హైదరాబాద్:** ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ నగరం అందంగా ముస్తాబు కానుంది. మే 7 నుంచి 31 వరకు హైటెక్స్‌లో జరిగే ఈ పోటీల కోసం జీహెచ్ఎంసీ రూ.1.79 కోట్ల అంచనాతో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. హైటెక్ సిటీ చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు చార్మినార్, ట్యాంక్‌బండ్, రాష్ట్ర సచివాలయం, దుర్గంచెరువు తదితర తరువాయి 2లో





## సైనిక సన్నద్ధతపై కీలక భేటీలు

- ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ 40 నిమిషాల పాటు చర్చ
- అంతకుముందు త్రిదళాధిపతితో రక్షణ మంత్రి మంతనాలు
- 16 పాక్ యూట్యూబ్ ఛానళ్లపై కేంద్రం నిషేధం
- మా దేశ ఉనికికి ముప్పు కలిగితే అణ్వాయుధాలు వినియోగిస్తాం: పాక్
- పాకిస్థాన్ సార్వభౌమాధికారం పరిరక్షణకు మద్దతు: చైనా
- సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోండి: అమెరికా

2లో

## మందుపాతరలున్నా.. ముందుకే..

- : కర్రెగుట్టల్లో ఏడో రోజూ కొనసాగిన అన్వేషణ
- * నాలుగు రోజుల క్రితం మృతిచెందిన మహిళా మావోయిస్టుల గుర్తింపు
- * ఐఈడీలు, బాటిల్ బాంబుల నిర్వీర్యం



2లో

## 400- 600 చదరపు అడుగులలోపే 'ఇందిరమ్మ ఇల్లు'

- గృహ నిర్మాణశాఖ అధికారుల నిబంధనలు
- పలుచోట్ల అయోమయంలో లబ్ధిదారులు

**సమయం న్యూస్,** హైదరాబాద్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలోపే నిర్మించుకోవాలని ప్రభుత్వం షరతు పెడుతుండటంతో పలువురు లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రంలో 70,122 ఇళ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో 2,830 మంది లబ్ధిదారులు పునాదిని పూర్తి చేసుకున్నారు. ఇందులో సుమారు 280 మందికిపైగా 600 చదరపు అడుగులకుపైగానే ఇంటి నిర్మాణాన్ని చేపట్టినట్లు గుర్తించిన అధికారులు మొదటి విడత బిల్లు రూ.లక్ష విడుదలకు నిరాకరించారు. మళ్లీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునాదిలో తరువాయి 2లో





## భారత్‌కు రఫేల్‌ఎం జెట్‌లు!


- 26 యుద్ధవిమానాల కొనుగోలుకు ఫ్రాన్స్‌తో ఒప్పందం

**సమయం న్యూస్,** దిల్లీ: భారత నౌకాదళానికి అధునాతనమైన రఫేల్ మెరైన్ జెట్‌లు అందబోతున్నాయి. ఇందుకోసం భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య రూ.64వేల కోట్ల ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. దీనికింద 26 రఫేల్‌ఎం జెట్‌లు మన దేశానికి అందుతాయి. వీటిలో 22 సింగిల్ సీటర్ ఫైటర్లు కాగా.. మిగతావి రెండు సీట్ల ట్రైనర్ వెర్షన్‌కు చెందినవి. ఈ యుద్ధవిమానాలను విమానవాహక నౌక

తరువాయి 2లో

## అణగారిన వర్గాల అభ్యున్నతితోనే సమాజంలో మార్పు

- అందుకే అప్పట్లో మావోయిస్టులతో చర్చలు
- సీఎం రేవంత్‌రెడ్డితో అనుభవాలను పంచుకున్న జానారెడ్డి, కేశవరావు
- శాంతి చర్చలపై అధిష్ఠానం అభిప్రాయం కోరాలని నిర్ణయం



**సమయం న్యూస్,** హైదరాబాద్: వామపక్ష తీవ్రవాదాన్ని తమ ప్రభుత్వం సామాజిక సమస్యగానే పరిగణిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశం నిర్ణయించింది. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్రానికి లేఖ రాసే కంటే ముందు తమ పార్టీ అధిష్ఠాన నిర్ణయం తెలుసుకోవాలని అభిప్రాయానికి వచ్చారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆధ్వర్యంలోని శాంతి చర్చల కమిటీ ఆదివారం సీఎంను కలిసి ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు జరుపుతున్న గాలింపును నిలిపివేసి తరువాయి 2లో

## ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత!

- విభజన చట్టంలో సవరణకు అవకాశం ఉందేమో పరిశీలిద్దాం
- ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ గడువు ముగిసింది కాబట్టి ఇబ్బంది ఉండకపోవచ్చు
- ఈ అంశాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళతా
- రిటర్నబుల్ ప్లాట్లకు రుణమిచ్చేలా బ్యాంకులతో మాట్లాడతా
- అమరావతి ప్రస్థానాన్ని వివరిస్తూ మ్యూజియం ఏర్పాటు
- రాజధాని రైతులు, మహిళలకు చంద్రబాబు హామీ
- పునఃప్రారంభోత్సవానికి కుటుంబాలతో కలిసి రావాల్సిందిగా ఆహ్వానం

2లో



## మెరిసిన తెలుగు ప్రతిభా పద్మాలు



2లో

- డాక్టర్ నాగేశ్వరరెడ్డికి పద్మ విభూషణ్, బాలకృష్ణకు పద్మ భూషణ్
- మిరియాల అప్పారావు, మాడుగుల నాగఫణి శర్మలకు పద్మశ్రీ
- తొలి విడతగా మొత్తం 71 మందికి పౌర పురస్కారాలు
- రాష్ట్రపతి భవన్‌లో ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

# సైనిక సన్నద్ధతపై కీలక భేటీలు

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య రాజుకున్న ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వెంట వరుసగా నాలుగో రోజూ పాక్ సైన్యం కవ్వింపులకు పాల్పడింది. కొత్తగా పూంఛ్ సెక్టార్‌లో భారత సైనిక శిబిరాలపై కాల్పులు జరపగా భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. పహల్గాం ఉగ్రదాడిపై ఎలా ప్రతిస్పందించాలనే దానిపై కేంద్రప్రభుత్వ స్థాయిలో విస్తృత మంతనాలు జరుగుతున్నాయి. అటువైపు పాకిస్థాన్ కూడా వ్యూహాల్లో నిమగ్నమై ఉంది. తుర్కియే నుంచి సైనిక రవాణా విమానాలు ఇస్లామాబాద్‌కు చేరుకున్నాయి. సార్వభౌమాధికారం పరిరక్షణలో పాకిస్థాన్‌కు అండగా ఉంటామని చైనా ప్రకటించింది. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలంటూ అమెరికా సూచించింది.

**రాజ్‌నాథ్ వరుస భేటీలు**

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాది దేశం అణ్వస్త్రాలను ప్రస్తావించిన నేపథ్యంలో...భారత ప్రభుత్వం తగు వ్యూహం ఖరారులో నిమగ్నమైంది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు సన్నద్ధత అంశమై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించినట్లు తెలిసింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ కూడా పాల్గొన్నారు. దాదాపు 40 నిమిషాల పాటు కొనసాగిన సమావేశం అనంతరం అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. అంతకుముందు త్రిదళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్‌తో రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. అక్కడ తీసుకున్న కీలక నిర్ణయాల వివరాలను ప్రధానికి రక్షణ మంత్రి వివరించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులకు కఠిన శిక్ష తప్పదని ఆదివారం ఆకాశవాణిలో ప్రసారమైన మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. బాధితులకు తప్పక న్యాయం జరుగుతుందని, ఉగ్రదాడి ఘటనతో దేశ ప్రజల రక్తం మరుగుతోందన్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యల నేపథ్యంలో జరుగుతున్న వరుస భేటీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సోమవారం సాయంత్రం పార్లమెంటు ప్రాంగణంలో.. రక్షణ వ్యవహారాల స్థాయీ సంఘం సమావేశమైంది. ఎంపీలు రాధా మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, విష్ణుపాల్ రే, జగన్నాథ్ సర్కార్, శక్తి సింగ్ గోహిల్, సంజయ్ సింగ్ హాజరయ్యారు.

**మళ్లీ రెచ్చగొట్టిన పాక్..**

పాకిస్థాన్ సైన్యం వరుసగా నాలుగో రోజూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది. దీన్ని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. 'ఆదివారం అర్ధరాత్రి వేళ కుప్వారా, పూంఛ్ జిల్లాల్లోని నియంత్రణ రేఖ వెంబడి పాక్ సైన్యం లక్షిత కాల్పులకు తెగించింది. భద్రతా బలగాలు తక్షణమే స్పందించి శత్రువుల దాడిని తిప్పికొట్టాయి' అని భారత సైన్యం సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పూంఛ్ సెక్టార్‌లో పాక్ ఆర్మీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ఈ మధ్య కాలంలో ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొంటున్నారు.

**ఉగ్ర స్థావరాల సమీపంలోకి సైన్యం**

26 మంది పర్యాటకులను హత్య చేసిన ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో భద్రతా దళాలు ఇప్పటికే నాలుగు సార్లు అత్యంత సమీపంలోకి వెళ్లగా ఉగ్రవాదులు త్రుటిలో తప్పించుకొరని తెలుస్తోంది. ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద, తర్వాత కుల్గాం అడవుల్లో కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. తిరిగి త్రాల్ కొండల్లో, అనంతరం కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది.

**పాక్ యూట్యూబ్ ఛానళ్లపై వేటు**

భారత్‌కు వ్యతిరేకంగా కథనాలను ప్రసారం చేస్తున్నాయన్న ఆరోపణలతో 16 పాక్ యూట్యూబ్ ఛానళ్లను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. డాన్ న్యూస్, జియో న్యూస్, సామా టీవీ సహా పలు మీడియా ఛానళ్లు, కొంతమంది పాత్రికేయుల సామాజిక మాధ్యమ ఖాతాలపై వేటు వేసింది. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ ఛానల్ కూడా వీటిలో ఒకటి.

*** పహల్గాం కవరేజీపై బీబీసీకి కేంద్రం లేఖ**

జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని 'మిలిటెంట్ దాడి'గా పేర్కొంటూ బీబీసీ వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించడంపై కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'కశ్మీర్‌లో దాడి అనంతరం భారతీయుల వీసాలను పాకిస్థాన్ సస్పెండ్ చేసింద'ంటూ ఒక వ్యాసంలో బీబీసీ పేర్కొనడంపైనా మండిపడింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భారత్‌లోని బీబీసీ అధిపతి జాకీ మార్టిన్‌కు లేఖ రాసింది. ఇక నుంచి బీబీసీ కవరేజీని పర్యవేక్షిస్తామని లేఖలో పేర్కొంది.

# 400 600 చదరపు అడుగులలోపే 'ఇందిరమ్మ ఇల్లు'

**(మొదటిపేజీ తరువాయి)**

మార్పులు చేసుకుంటేనే బిల్లులు అందిస్తామని చెబుతున్నారు.

**అప్పుడలా.. ఇప్పుడిలా.. ఇలా అయితే ఎలా?**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సొంత స్థలాలు ఉన్నవారు తమకు నచ్చిన విస్తీర్ణంలో నిర్మాణాలు చేసుకోవచ్చని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ప్రభుత్వం పలు సందర్భాల్లో వెల్లడించింది. మోడల్ ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచినప్పటికీ ఎలాంటి నిబంధనలను పెట్టబోమని తెలిపింది. తాజాగా అధికారులు 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్యలోనే ఇంటిని నిర్మించుకోవాలని పదేపదే చెబుతుండడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు తాము కూడా ఇంటికి అదనంగా ఖర్చు చేసుకుంటున్నామని, ఇప్పుడు నిబంధనలు విధిస్తే ఎలా అని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 600 చదరపు అడుగులు దాటితే బీపీఎల్ పరిధిలోకి రారని అధికారులు అంటున్నారు. వాస్తవానికి పేదల ఇళ్లను 400 చదరపు అడుగుల్లోనే నిర్మించాలని, ప్రభుత్వం అదనంగా 200 చదరపు అడుగులకు పెంచిందని హౌసింగ్ శాఖ అంటోంది. మే 5వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల రెండో జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగుల లోపు ఉండాలనే నిబంధనను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా యంత్రాంగాలకు గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్నారు.

# భారత్‌కు రఫేల్‌ఎం జెట్‌లు!

**(మొదటిపేజీ తరువాయి)**

ఐఎన్‌ఎస్ విక్రాంత్‌పై మోహరిస్తారు. తాజా ఒప్పందంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ సాయుధ దళాల మంత్రి సెబాస్టియన్ లెకోర్నులు సంతకాలు చేశారు. ఈ ప్రతులను రెండు దేశాల అధికారులు ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి థియెర్రీ మథౌ పాల్గొన్నారు. రఫేల్‌ఎంను ఫ్రాన్స్‌కు చెందిన దసో ఏవియేషన్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. భారత వైమానిక దళం వద్ద ఇప్పటికే 36 రఫేల్ జెట్‌లు ఉన్నాయి. వీటికి.. కొత్తగా సమకూర్చుకోనున్న నౌకాదళ వెర్షన్‌తో సారూప్యతలు ఉంటాయి. ఫలితంగా రెండు దళాల మధ్య సమన్వయం మరింత పెరుగుతుంది. నేవీ మరింత శక్తిమంతమవుతుంది.

**తాజా ఒప్పందం ప్రకారం..**

* రఫేల్ జెట్‌ల బాడీ ఉత్పత్తికి భారత్‌లో ఒక కేంద్రం ఏర్పాటవుతుంది. అలాగే ఈ యుద్ధవిమానాల ఇంజిన్లు, సెన్సర్లు, ఆయుధాల నిర్వహణ, మరమ్మతులకు ప్రత్యేక వసతులు సిద్ధమవుతాయి.
* భారత స్వదేశీ ఆయుధాలను ఈ యుద్ధవిమానాలతో అనుసంధానం చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఫ్రాన్స్.. మన దేశానికి బదలాయిస్తుంది.
* ఒప్పందం కింద తొలి యుద్ధవిమానం 2028లో భారత్‌కు అందుతుంది. చివరి జెట్ 2030లో వస్తుంది. ఈ యుద్ధవిమానాల వినియోగంపై మన నౌకాదళ సిబ్బందికి ఫ్రాన్స్, భారత్‌లో శిక్షణ ఇస్తారు. సిమ్యులేటర్లు, ఇతర సాధన సంపత్తి, ఆయుధాలు అందిస్తారు.
* భారత వైమానిక దళం వద్ద ప్రస్తుతం ఉన్న రఫేల్ యుద్ధవిమానాలకు అదనపు సాధనాలను అందించడం కూడా ఈ ఒప్పందంలో భాగం.

# ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి



హైదరాబాద్: మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ) వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎ.శాంతికుమారి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం పనిచేస్తున్న ఈమె.. ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. పదవీ విరమణ అనంతరం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ వైస్ ఛైర్‌పర్సన్‌గా శాంతికుమారి బాధ్యతలు స్వీకరిస్తారు. ఈమెకు ఇదే సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు సోమవారం వేర్వేరు ఉత్తర్వులు విడుదల చేశారు.

# అభద్రతలో కేసీఆర్

హైదరాబాద్: ''ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాటల్లో అభద్రత కనిపించింది. ఆయన ప్రసంగంలో పస లేదు. స్పష్టత లేదు. కాంగ్రెస్‌పై తన అక్కసునంతా వెళ్లగక్కారు. కేసీఆర్ ఏం చేసినా.. భారాసను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. అసెంబ్లీలో భారాస తరఫున మాట్లాడుతున్నది పిల్లగాళ్లని ఆయనే చెప్పేశారు. మరి వారినెందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారు'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి ఇంటి వద్ద సోమవారం సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ''ఆపరేషన్ కగార్‌పై గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు.. ఈరోజు జానారెడ్డి, కేకేలతో చర్చించాం. ఈ అంశంపై జాతీయస్థాయిలో చర్చ జరగాలి. మా పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత.. ప్రభుత్వ విధానం ప్రకటిస్తాం. రాహుల్ గాంధీకి, నాకు మధ్య అంతరం(గ్యాప్) ఉందనడం అవాస్తవం. మా మధ్య మంచి సంబంధాలున్నాయి. మా ఇద్దరికీ ఉన్న సంబంధాన్ని బయట ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదు. ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం అస్సల్లేదు. కేసీఆర్, మోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరా గాంధీ లాంటి ప్రధాని కావాలి. ప్రపంచంలో ఆమెను మించిన యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన ఘనత ఇందిరా గాంధీదే.

**పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ**

మా ప్రభుత్వ పాలనపై ఇప్పటినుంచే చర్చ ఎందుకుంటుంది? ఎన్నికలకు ముందు చివరి ఆరు నెలలూ చర్చ జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు.. దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక కొత్త పథకాలు తీసుకొచ్చాం. తొలి ఏడాదిన్నర ప్రణాళికల రూపకల్పనకే సమయం పోయింది. ఇప్పుడు వాటిని సమీక్షిస్తున్నాం. పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

**ఓపికగా ఉంటే పదవులు వస్తాయి**

మరో 20 ఏళ్లు నేను రాజకీయాల్లో ఉంటా. గత ప్రభుత్వంలో తప్పు చేసినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ వస్తోంది. కానీ, నేను అలా అరెస్టు చేయలేను. అన్నీ చట్టప్రకారమే జరుగుతాయి. నేను కేసీఆర్ లాగా చట్టాన్ని అతిక్రమించను. చట్టప్రకారమే నడుచుకుంటా. నేను ఒక మాట ఇచ్చానంటే.. అంతే అంకితభావంతో పనిచేస్తా. ఇచ్చిన మాటను అమలుచేసి తీరుతా.

# అణగారిన వర్గాల అభ్యున్నతితోనే సమాజంలో మార్పు

**(మొదటిపేజీ తరువాయి)**

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే. గతంలో హోంమంత్రి హోదాలో మావోయిస్టులతో చర్చలు జరిపిన జానారెడ్డితోపాటు ఇతర మంత్రులతో చర్చించి దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటామని సీఎం వారికి హామీ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం జానారెడ్డి ఇంట్లో సమావేశం నిర్వహించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేశవరావు హాజరయ్యారు. శాంతి చర్చల కమిటీ చేసిన ప్రతిపాదనలు, ఇందులో సాధ్యాసాధ్యాలు, తాము అనుసరించాల్సిన విధానం గురించి ముగ్గురూ దాదాపు గంటసేపు చర్చించారు. 2005లో జరిగిన శాంతి చర్చల్లో జానారెడ్డి, కేశవరావు ఇద్దరూ పాల్గొన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ శాంతిభద్రతల సమస్య కంటే సామాజిక సమస్యగానే పరిగణిస్తుందని, అణగారిన వర్గాల అభ్యున్నతితోనే సమాజంలో మార్పు తీసుకురావచ్చని నమ్ముతుందని, అందుకే అప్పట్లో మావోయిస్టులను చర్చలకు పిలిచిందని వారు తెలిపారు. ఇదే సమయంలో ఏరూపంలో ఉన్నా హింసను సహించేది లేదన్నారు. 2005 నాటి శాంతి చర్చలు మంచి ఫలితాలు ఇచ్చాయని, అనేక ప్రాంతాల్లో హింస చాలావరకు తగ్గుముఖం పట్టిందని చెప్పారు. శాంతి కమిటీ చేసిన విజ్ఞప్తిపై తమ వంతు ప్రయత్నం చేయాలని సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. అంతకంటే ముందు ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అభిప్రాయం తెలుసుకోవాలని, ఈ మేరకు లేఖ రాయాలని నిర్ణయానికి వచ్చారు.

# మందుపాతరలున్నా.. ముందుకే..

చర్ల, వెంకటాపురం : తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో భద్రతా బలగాలు అడుగడుగునా మందుపాతరల గండం ఎదురవుతున్నా ఏడో రోజు సోమవారం కూంబింగ్ కొనసాగించాయి. మావోయిస్టులు తమ కీలకమైన స్థావరాల సమీపంలో రక్షణగా ఏర్పాటు చేసిన బాంబులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తిస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 150 ఐఈడీలను బలగాలు గుర్తించాయి. సోమవారం సాయంత్రం నడిపల్లిగల్లం నడుమ అరగంట పాటు కాల్పులు జరిగినట్లుగా అక్కడి ప్రజలు చెబుతున్నారు. ములుగు జిల్లాలోని పామునూరు సమీప ఒక్కడుగు గుట్ట, ముకునూరు ఎత్తుగుట్ట, దేవునిగుట్టల బాటల్లో ఐఈడీలను భద్రతా బలగాలు గుర్తించాయి. పదుల మీటర్ల దూరంలో తీగలు అమర్చి మందుపాతరలను పాతిపెట్టిన వాటిని చాకచక్యంగా నిర్వీర్యం చేశారు. ఇదే క్రమంలో కొత్త పంథాలో మావోయిస్టులు బీరు సీసాల్లో ఏర్పాటు చేసిన బాంబులు సైతం తాజాగా వెలుగులోకి వచ్చాయి. బీజాపుర్ జిల్లా నైరుతి దిశ అడవుల్లో నాలుగు రోజుల క్రితం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మహిళా మావోయిస్టుల వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించారు. వీరు పీఎల్‌జీఏ నంబర్ 1 బెటాలియన్‌కు చెందిన సభ్యులు శాంతి, హుంగీ, సింటేలుగా వెల్లడించారు. అడవులను జల్లెడ పడుతున్న బృందాలు అక్కడి గిరిజనులను చక్రబంధం చేసినట్లు తెలుస్తోంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లోని పెనుగోలు, పామునూరు, చెలిమల ప్రాంతాల్లో ఆంక్షలు విధించినట్లు సమాచారం. ప్రతి వారం మండల కేంద్రాల్లోని వార సంతలకొచ్చి నిత్యావసరాలు కొనుగోలు చేసుకునే ఆదివాసీలు బయటికి రాకుండా ఇళ్లలోనే ఉండిపోయారు.

# నగరం.. సుందరీకరణం

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రాంతాల్లో థీమాటిక్ లైటింగ్, సెల్ఫీ పాయింట్లు, ఎల్‌ఈడీ విద్యుద్దీపాలతో ప్రపంచ సుందరి కిరీటం నమూనాలను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. పనులు త్వరలోనే మొదలుకానున్నాయి. విమానాశ్రయం రహదారి పక్కన 130 దేశాల జాతీయ పతాకాలను ఏర్పాటు చేయనున్నారు. 'మిస్ వరల్డ్ 2025' ఆంగ్ల అక్షరాలు, భారీ స్వాగత బోర్డుల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. తెలంగాణ సచివాలయం వద్ద 20 దేశాల జెండాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.28,96,900 వ్యయమవుతుందని అంచనా వేశారు. హైటెక్ సిటీలోని దుర్గం చెరువు, ఏఎంబీ మాల్, గచ్చిబౌలి, రాయదుర్గం మెట్రో స్టేషన్‌ల వద్ద సెల్ఫీ పాయింట్లు, స్వాగత తోరణాలు(ఆర్చ్), డాంగ్లర్స్, బంటింగ్స్, ఎల్‌ఈడీ కిరీటం, ఫెయిరీ క్వీన్ వంటి అలంకరణలు ఏర్పాటు చేయడానికి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం రూ.34,10,200తో టెండర్లు పిలిచింది. రూ.28,32,000తో శిల్పారామం, బయోడైవర్సిటీ పార్కు వద్ద విద్యుద్దీపాలంకరణ చేపట్టనున్నారు. రూ.11,60,000తో చార్మినార్ పక్కనున్న లాడ్‌బజార్ రహదారిని డెకరేటివ్ లాంథర్ లైటింగ్‌తో అలంకరిస్తారు. ఓ సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు.

# ఆంధ్రప్రదేశ్.. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత!



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ విభజన చట్టంలో పార్లమెంటు ద్వారా సవరణ చేసేందుకు అవకాశం ఉందేమో పరిశీలించి, చేయిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళతానని రాజధాని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందని విభజన చట్టంలో పేర్కొన్నారని, ఇప్పుడు ఆ గడువు ముగిసింది కాబట్టి.. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేందుకు ఇబ్బంది ఉండకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. రాజధాని అమరావతి పనుల్ని ప్రధాని మోదీ మే 2న పునఃప్రారంభించనున్న నేపథ్యంలో చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సోమవారం రాజధాని రైతులు, మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాజధాని పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజధాని రైతులంతా కుటుంబసభ్యులతో రావాలని సీఎం ఆహ్వానించారు. ఆ సందర్భంగా రాజధాని రైతులు తమ ఆకాంక్షల్ని ఆయన ముందుంచారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందీ లేకుండా.. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతిని కేంద్ర ప్రభుత్వం ప్రకటించేలా చేయాలని రైతులు కోరారు. ఎన్డీయేలో తెదేపా కీలక భాగస్వామిగా ఉన్నందున చంద్రబాబు చెబితే ప్రధాని మోదీ వింటారని వారు పేర్కొన్నారు. దానిపై చంద్రబాబు స్పందిస్తూ... 'అది మన పరిధిలోని అంశం కాదు. మనం డిమాండ్ చేయకూడదు. సామరస్యంగా అన్నీ సాధించుకుందాం' అని పేర్కొన్నారు. మే రెండో తేదీ రాష్ట్ర చరిత్రలో మైలురాయి కాబోతోందని.. రాజధాని నిర్మాణంలో ఇదో కీలక ముందడుగు అవుతుందని ఆయన తెలిపారు. రైతుల త్యాగం వల్లే అంతర్జాతీయ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మించుకుంటున్నామని.. వారి మంచి మనసును రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకుంటారని సీఎం కొనియాడారు. ఈ సందర్భంగా రైతులు, మహిళలతో ఆయన ముచ్చటించి... వారి సందేహాలు నివృత్తి చేశారు. రైతులకిచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు బ్యాంకులు రుణాలివ్వడం లేదని పలువురు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను సత్వరం పరిష్కరిస్తామని, రుణాలిప్పించేలా బ్యాంకులతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. రాజధానివాసులకు అండగా ఉండేందుకు, భరోసా కల్పించేందుకే తానూ అమరావతిలో ఇల్లు కట్టుకుంటున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రితో తమ చర్చల సారాంశాన్ని అనంతరం రాజధాని రైతులు విలేకర్లకు వెల్లడించారు. అదనపు భూసమీకరణతో ధరలు పడిపోతాయనేది అపోహే రాజధానికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో అదనంగా తలపెట్టిన భూసమీకరణ గురించి రైతులు ప్రస్తావించగా.. హైదరాబాద్ మహానగరంలా అమరావతి అభివృద్ధి చెందాలంటే విశాలంగా ఉండటం ఎంతైనా అవసరమని చంద్రబాబు అన్నారు. అదనపు భూసేకరణ కారణంగా ఈ ప్రాంతంలో ధరలు పడిపోతాయనేది అపోహలు మాత్రమేనని... వాటిని నమ్మొద్దని సూచించారు. 'ఉమ్మడి రాష్ట్రంలో శంషాబాద్ విమానాశ్రయానికి భూసేకరణ చేసినప్పుడు 5 వేల ఎకరాలు ఎందుకని కొందరు ప్రశ్నించారు. అప్పుడు ముందుచూపుతో భూమి సేకరించబట్టే నేడు అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం నిర్మాణంతో పాటు పెద్ద హోటళ్లు, మాల్స్ వచ్చి ఆర్థిక కార్యకలాపాలు భారీగా పెరిగాయి. చుట్టుపక్కల భూముల విలువ పెరిగి రైతులకు మేలు జరిగింది' అని చంద్రబాబు వివరించారు. అమరావతిలో కూడా భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయం, క్రికెట్ స్టేడియం నిర్మాణాలకు మరికొంత భూమి అవసరమవుతుందని.. దీనికి అనుగుణంగానే అదనంగా భూసమీకరణ చేస్తున్నట్టు వివరించారు.

*** అమరావతి రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు**

**మీ అభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయం ఉండదు**

'స్వచ్ఛందంగా భూములిచ్చిన మీ అభీష్టానికి వ్యతిరేకంగా, నష్టం జరిగేలా ఏ కార్యక్రమం, నిర్ణయం ఉండదు. రైతులకు నాకు మధ్య దూరం ఉండదు. మీ ప్రయోజనాలకు విరుద్ధంగా ఏమీ జరగదు' అని చంద్రబాబు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో కృష్ణా నదిపై మరో మూడు నాలుగు వంతెనలు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు వస్తాయన్నారు. రాజధాని ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రైతుల త్యాగాలకు గుర్తుగా ఓ స్మారకాన్ని నిర్మించాలని రైతులు కోరగా.. శాతవాహనుల నుంచి అమరావతి ఉద్యమం వరకూ ప్రతి విషయాన్ని, పరిణామాన్ని క్రోడీకరిస్తూ మ్యూజియం ఏర్పాటు చేస్తానని చెప్పారు. మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో మానసిక దృఢత్వం పెరుగుతుంది

**: బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారు..**

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 29 సమయం న్యూస్ : ఈరోజు 130 సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్. నాయక్ నందు సుమారు 2.90 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణాన్ని బిఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... పిల్లలు మొబైల్ ఫోన్లకు పరిమితం కాకుండా క్రీడల్లో ప్రోత్సహించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో షటిల్ కోర్ట్స్ క్రీడా ప్రాంగణం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, శేషా చారి, దుర్గా రావు, శివాజీ, భాస్కర్ రెడ్డి, హరిబాబు యాదవ్, నర్సింగ్ రావు, శ్యామ్, గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రావు, పద్మ, అనిల్, శ్రీదేవి, సరిత, ఉమా, స్వర్ణ, ఎస్.ఆర్.నాయక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సదానంద చారి, ప్రభాకర్, జనప్రియ భాస్కర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

*** ఇల్లందు డిఎస్పి చంద్రబాబు**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28 (సమయం న్యూస్): ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని ఇల్లెందు డిఎస్పీ చంద్ర భాను సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి పోలీసులు సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొత్తి కోయ గ్రామమైన బూస్రాయి గ్రామంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పీ చంద్రభాను పాల్గొన్నారు. ముందుగా డి.ఎస్.పి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్ శాఖ తరపున అట్టి సమస్యలను సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో నివసించే ఆదీవాసీ ప్రజలకు విద్య వైద్యం రవాణా వంటి సౌకర్యాలను అందించడంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎల్లవేళలా ముందుంటారని ఇతర శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. దురలవాట్లకు దూరంగా ఉంటూ గ్రామంలోని యువత మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ సురేష్ ఆళ్ళపల్లి ఎస్సై సోమేశ్వర్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోడిపందాలపై ఉక్కు పాదం మోపండి

*** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి**
*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
*** దమ్మపేట పోలీస్ స్టేషన్ సందర్శన**
*** అధికారులకు సిబ్బందికి పలు సూచనలు**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(సమయం న్యూస్): కోడి పందాలు పేకాట బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. సోమవారం దమ్మపేట పోలీస్ స్టేషన్ ను ఎస్పీ రోహిత్ రాజు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధి కారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కోడిపందాలు పేకాట బెట్టింగు లు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాల కదలికలపై నిఘా పెంచి దొంగతనాల కట్టడికి కృషి చేయాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణ చర్యలను చేపట్టాలని సూచించారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట సిఐ నాగరాజు రెడ్డి దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పారిశుద్ధ్య కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య

వెల్దుర్తి ఏప్రిల్ 28 సమయం న్యూస్: వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు ముల్కశేకులు తండ్రి రాములు వయసు, 55 సంవత్సరాలు వెల్దుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా కొన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్నాడు. తెచ్చిన అప్పుల భారం పెరగడంతో తరచూ తాగి రావడంతో అలాగే తరచు ఇంట్లో గొడవలు కావడంతో మనస్థాపం చెందిన శేకులు సోమవారం తెల్లవారుజామున గ్రామంలోని పాత గ్రామపంచాయతీ భవనంలో గల చుట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ముల్కశేకులు కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీటి పర్వతమై విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు



కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ మార్చరికి తరలించారు. మృతుడికి భార్య సునీత ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని స్థానికులు కోరారు.

## వరంగల్ బీఆర్ఎస్ సభ గ్రాండ్ సక్సెస్

*** తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు**
*** మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(సమయం న్యూస్): వరంగల్ ఎల్కతుర్తి లో జరిగిన బీఆర్ఎస్ సభ గ్రాండ్ సక్సెస్ అయిందని సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి తరలివచ్చిన ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లుగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో సభ విజయవంతం అయిందన్నారు. తన నలభై ఏళ్ళ రాజకీయ జీవితంలో ఇలాంటి సభ చూడలేదన్నారు. నభూతో న భవిష్యత్ అన్న రీతిలో ప్రజలు స్వచ్ఛందంగా లక్షలాదిగా తరలి రావడం జరిగిందన్నారు. ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. తెలంగాణలో బి ఆర్ ఎస్ పార్టీకి తిరుగులేదని వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీ పార్టీలని బొంద పెట్టడం ఖాయమన్నారు. కొత్తగూడెం నియోజక



వర్గం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడం హర్షణీయమన్నారు. తనపై ఎంతో నమ్మకం విశ్వాసంతో సభకు వచ్చిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. నియోజక వర్గంలో ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు చేసినా బయటపడేది లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటిఆర్ నేతృత్వంలో కష్టపడి పని చేసి కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీని పునర్వైభవం దిశగా తీసుకు వస్తానని చెప్పారు. వరంగల్ సభను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు సహకరించిన కొత్తగూడెం గులాబీ శ్రేణులకు ప్రజలకు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నట్లుగా వనమా పేర్కొన్నారు.



## బసవతారక నగర్ సెంటర్లో పోషణ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహణ

బోధన్ పట్టణం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : బోధన్ పట్టణం బస్వతారక నగర్ సెంటర్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సూపర్వైజర్ రాధిక నేతృత్వంలో 2025 పోషణ పక్వాడ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ రాధిక మాట్లాడుతూ "1000 డేస్" ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా, శ్రీమంతాల కార్యక్రమం, అన్నప్రాసన వంటి చైతన్యవంతమైన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శివకుమార్, సవిత, రజిత, వసీం బేగం, మహమూదా బేగం, ఏఎన్ఎం నాగరాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పిల్లల తల్లులు పెద్దఎత్తున పాల్గొని, పోషణపై అవగాహన పొందారు. పోషణ పక్షం లక్ష్యం: తల్లి, శిశు ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పోషకాహారం ప్రాముఖ్యతను జనాల్లోకి తీసుకెళ్లడం. ఈ తరహా కార్యక్రమాలు బాలల ఆరోగ్యం కోసం ఎంతో అవసరమని టీచర్లు తెలిపారు.

## సమగ్రమైన క్రీడా పాలసీలు వచ్చేందుకు కృషి చేస్తా

*** తెలంగాణ బ్యాట్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్**

క్రీడా ప్రతినిధి, ఏప్రిల్ 28 : తెలంగాణ రాష్ట్రంలో సమగ్రమైన బ్యాడ్మింటన్ క్రీడా పాలసీలు వచ్చేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, భారత బ్యాట్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అన్నారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో బ్యాట్ ఏర్పాటు చేసిన వార్షిక సాధారణ సమావేశానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వై ఉపేందర్ రావు గారు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు చాముండేశ్వరి




నాథ్, జి వెంకటేశ్వర్ రావు, పి రమేష్ రెడ్డిలు. సంయుక్త కార్యదర్శులు ఎల్ రవికుమార్, మనోజ్ కుమార్, యువిఎన్ బాబు (ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్), కోశాధికారి వంశిధర్, మెంబర్లు పిసిఎస్ రావు, రామ్మోహన్, రంగారావు, ఏఎన్ సూరి, రంగారెడ్డి జిల్లా బ్యాట్మెంటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పి సుధాకర్, నాగమణిలతో పాటు రాష్ట్రంలోని 19 జిల్లాల నుంచి బ్యాట్మెంటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శిలు హాజరయ్యారు. అనంతరం పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాట్మెంటన్ క్రీడలు అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యక్రమాలు రూపొందిస్తున్నామని అందులో భాగంగానే నేడు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వెబ్ సైట్ ను ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం బ్యాట్ సలహాదారునిగా కే. లక్ష్మణ్, బ్యాట్ మీడియా కోఆర్డినేటర్ గా వెంకటరమణారెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి హర్ష, పెద్దపల్లి వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎండి గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి

*** జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్ ఏప్రిల్28(సమయం న్యూస్): ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ వైద్య అధికారులకు సూచించారు. సోమవారం పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ల తో కలసి జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఇన్ పేషెంట్, లాబరేటరీ, మందుల నిల్వ గదితో పాటు ఔట్ పేషెంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్ ల ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ మరమ్మతులు పనులను త్వరితగతిన చేపట్టాలని అదేవిధంగా ఆసుపత్రి, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చాలని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలు, గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, ప్రసవాల వివరాలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, ఏవైనా మందుల లోటు ఉంటే తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే



అవసరమైన మందులను సరఫరా చేయిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం పెద్దేముల్ బి సి బాలుర వసతి గృహాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.



## సమయం న్యూస్ ఎఫెక్ట్.... రాత్రివేళ షాపులు తెరిచి ఉంచిన ముగ్గురికి జైలు శిక్ష

బోధన్ పట్టణం ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు అతిక్రమించి రాత్రివేళ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న సంగతిని సమయం డైలీ న్యూస్ లో కథనం రావడంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్థానిక అధికార యంత్రాంగం వెనువెంటనే స్పందించి వారిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. బోధన్ పట్టణంలో రాత్రి 10:30 తర్వాత షాపులు తెరిచి ఉంచిన యజమానులను సోమవారం నాడు రెండవ తరగతి మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి ముందు అదుపులోకి తీసుకున్న ముగ్గురుని హాజరుపరిచి జైలు శిక్ష విధించారు. రంగర్ గల్లీకి చెందిన పవన్ చారి హనుమాన్ మందిరం వద్ద ఉన్న తన బంగారం షాపును, అలాగే షక్కర్ నగర్ కు చెందిన షేక్ యాకుబ్ తన మిల్క్ డైరీని రాత్రిపూట తెరిచి ఉంచినందుకు ఒక్కరోజు జైలు శిక్ష విధించారు. సాత్పుల్ వద్ద స్ప్రింగ్ బేకరీ యజమాని షేక్ హుస్సేన్ కు రెండు రోజుల జైలు శిక్ష విధించబడింది. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం రాత్రి 10:30 గంటల తర్వాత హోటల్స్, దాబాలు, ఇతర వాణిజ్య సంస్థలు మూసివేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని బోధన్ పట్టణ ఎస్ హెచ్ ఓ వెంకట్ నారాయణ స్పష్టం చేశారు. సభ్య సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తున్న సమయం డైలీ న్యూస్ నిర్వాహకులను బోధన్ పట్టణ ఎస్ హెచ్ ఓ వెంకట్ నారాయణ అభినందించారు. సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ అంకిత భావం ఉండాలని, అందుకోసం అందరూ పనిచేయాలని అన్నారు.

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

* ఆపరేషన్ కగార్ ఆపేయాలి
* కర్రెగుట్ట మోహరించిన కేంద్ర సైనిక బలగాలను వెనక్కు పంపాలి
* రౌండ్ టేబుల్ సమావేశంలో రాజకీయ ప్రజా సంఘాల నాయకుల విజ్ఞప్తి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(సమయం న్యూస్): ఆపరేషన్ కగార్ ఆపేయాలని కర్ర గుట్టను చుట్టుముట్టిన కేంద్ర సైనిక బలగాలు వెనక్కి రావాలని మావోయిస్టు పార్టీతో చర్చలు కొనసాగించాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సోమవారం అని రాజకీయ పార్టీలతో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా తదితరులు ప్రసంగిస్తూ బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చకా మావోయిస్టు పార్టీని ఆపరేషన్ కగార్ పేరుతో అంతం చేస్తామని మార్చి 2026 నాటి కల్లా నక్సల్స్ లేకుండా చేస్తామని ప్రకటిస్తూ ఆదివాసి ప్రాంతాలలో ఆదివాసి ఉన్న చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని పేర్కొన్నారు. నూతన అటవి సంరక్షణ నియమాలు పేరుతో కొత్త చట్టాలను తీసుకువచ్చి కార్పొరేట్ సంస్థలకి ఆదివాసీల ప్రాంతాలలో ఉన్న ఖనిజ సంపదను అప్పజెప్పడం కోసం ప్రయత్నాలు కొనసాగిస్తా ఉందన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో 89 రకాల ఖనిజ సంపద ఉన్నదని వాటిని స్వాధీనపరచుకోవడం కోసం దాడులు అత్యాచారాలుఎన్కౌంటర్లు కొనసాగిస్తా ఉందన్నారు. 280 కిలోమీటర్ల వైశాల్యం కలిగిన కర్రెగుట్టను టార్గెట్ గా చేసుకుని 25 లక్షల సైన్యం జల్లెడ పడుతుందని వారు అన్నారు. తక్షణమే కర్రెగుట్టకు పోయిన సైన్యం వెనకకు రావాలని శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టుల తోటి కేంద్ర ప్రభుత్వం చర్చలు కొనసాగించాలని ప్రజాస్వామికంగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, కాంగ్రెస్ పీసీసీ రాష్ట్ర నాయకులు నాగ సీతారాములు, సిపిఐ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సలిగంటి శ్రీనివాస్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు లిక్కి బాలరాజు, టీజేఎస్ రాష్ట్ర నాయకులు మల్లె రామనాథం, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు ఉపేందర్, ఐలు జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్, ఆల్ ఇండియా ట్రైబల్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వర్ రావు, బీసీ సంఘం నాయకులు సైదుబాబు, ఎఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వర్ రావు, వివిధ రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల నాయకులు జె.సీతారామయ్య, వై గోపాలరావు, పృధ్వి, మోత్కూరి మల్లికార్జునరావు, మంజుల, ప్రశాంత్, అలీముద్దీన్, ప్రణయ్, కిరణ్, బుచ్చయ్య దొర తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(సమయం న్యూస్): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో ఉన్న నిరుపేదలకు 807 మందికి 75 గజాల చొప్పున స్థలం గత ప్రభుత్వం ఇచ్చిందని వారందరికీ ఎలాంటి కండిషన్ లేకుండా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలని సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పేదలకు న్యాయం చేయాలని ఇందిరమ్మండ్ల విషయంలో మాజీ ప్రజాప్రతినిధుల పెత్తనం ఉండకూడదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కన్వీనర్ జలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆలస్యం చేయకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడంతో పాటు పేదలకు కేటాయించిన స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు తక్షణమే ఋణం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వెన్నెల నగర్ లబ్ధిదారులకు అన్యాయం చేయాలని కొంతమంది చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనరులకు ఇండ్లు ఇస్తే అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో మాజీ కౌన్సిలర్ల ప్రాధాన్యత అస్సలు ఉండకూడదని అధికారులను కోరారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సైతం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు రామవరం ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారికి ఎలాంటి హక్కు పత్రాలు లేకపోవడంతోనే ఇండ్లు మంజూరయ్యే అవకాశం కనబడడం లేదని తెలిపారు. కొత్తగూడెం పట్టణంలో సైతం స్థలాలకు అతి తక్కువ మందికి పట్టాలు ఉండడంతో ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో కూడా తీవ్ర అన్యాయం జరగబోతుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెన్నెల నగర్ లబ్ధిదారులకు న్యాయం చేయడంలో స్పందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కొత్తగూడెం 36 వార్డుల విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో చేయాలని జలాల్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పథకాలకు అర్హులయ్యే నిరుపేదలు పాల్గొనడం జరిగింది.






## మంచి మార్కులు సాధిస్తున్న విద్యార్థులు

* వారిని ప్రోత్సహిస్తూ ఆర్థిక సహాయం
* చదువు ఉంటేనే బంగారు భవిష్యత్తుకు బాటలు
* ఎంఈఓ డాక్టర్ ప్రభు దయాల్
* హిమబిందుకు ప్రభు దయాల్ ప్రోత్సాహం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(సమయం న్యూస్): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో గల రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 2024లో పదవ తరగతి చదివిన హిమబిందు 8.2 జిపిఏ సాధించి పేరొందిన విద్యాసంస్థ అయిన తెలంగాణ గురుకుల సంస్థలో ఇంటర్మీడియట్లో ఎంపీసీ ఉచిత సీటును సాధించింది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జూనియర్ ఇంటర్ ఫలితాల్లో 458/470 (97 శాతం) సాధించినందున హిమబిందును ప్రోత్సహిస్తూ ఆమెకు రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ నూతన వస్త్రాలు రాత పుస్తకాలు క్యాష్ అవార్డును సోమవారం అందజేశారు. హిమబిందు తల్లికి సైతం చీరను బహుకరించారు. తండ్రి సుతారి మేస్త్రి అయినప్పటికీ హిమబిందు చదువుల రాణించడం అభినందనీయమన్నారు. బీదరికం చదువుకు అడ్డంకి కాదనీ చదివే బీదరికాన్ని తరిమేస్తుందని విజేతగా నిలుపుతుందన్నారు. చదువే తలరాతను సైతం మార్చుతూ భవిష్యత్తును నిర్ణయిస్తుందని ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి చదువులపైనే దృష్టి దృష్టి సారించాలని డాక్టర్ ప్రభు దయాల్ పేర్కొన్నారు.

# ఘనంగా మార్కండేయ స్వామి విగ్రహాల ఊరేగింపు

* మహిళల కోలాటం.
* ఇంటింటికి మంగళహారతులు.
* కన్నుల పండుగ ఉత్సవాలు..





రాయపోల్.ఎప్రిల్ 28 : రాయపోల్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఇందులో భాగంగానే మాకండేయ స్వామి ఆలయం నుంచి విగ్రహాల ఊరేగింపు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాల ఊరేగింపు ముందుకు కొనసాగింది. భారీ సంఖ్యలో మహిళల కోలాటం. యువకుల భక్తి ప్రావస్యం. ఇంటింటికి మంగళ హారతులు ఇవ్వడంతో విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. ఉదయం ఆలయం నుంచి విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగింపు ను ప్రారంభించారు. గ్రామ పురవీధుల్లో ప్రతి ఇంటి నుంచి మంగళ హారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పద్మశాలి సంఘం కులస్తులు కూడా ఇంటింటా మంగళారతులు అందించి ముక్కులు చెల్లించుకోవడంతో శ్రీ భక్త మార్కండేయ విగ్రహాల ఊరేగింపు గ్రామస్తులు. భక్తులు. పద్మశాలి సంఘం సభ్యులు ముందుకు సాగుతూ ఊరేగింపు కొనసాగింది. మార్కండేయ స్వామి ఉత్సవాల్లో మొదటిరోజు ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో భక్తుల దర్శన భాగ్యం కోసం స్వామివారి మొక్కులు చెల్లించుకోవడానికి చెల్లించుకోవడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మంగళవారం. బుధవారం. ప్రతిష్ట ఉత్సవాలు కొనసాగనున్నాయి. కాగా మార్కండేయ స్వామి ప్రతిష్ట ఉత్సవాలకు హాజరవుతున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా బుధవారం భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ట ఉండడంతో గ్రామ పద్మశాలి సంఘం కుటుంబ సభ్యులు. వారి బంధువులు. భక్తులు ఇప్పటికే గ్రామానికి చేరుకోవడంతో రాయపోల్ మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.




## సైబర్ క్రైమ్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కంగ్టి, 28 ఏప్రిల్ (సమయం న్యూస్) : మండల కేంద్రమైన కంగ్టిలో సోమవారం స్థానిక పోలీసులు సైబర్ క్రైమ్ నేరగాళ్లపై ప్రజకు అవగాహన కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ.... అపరిచితుల నుండి ఫోన్ కాల్, మెసేజ్ వస్తే ఎలాంటి ఓటీపీలు చెప్పొరదన్నారు.అలాగే మీకు ల్యాటరీ వచ్చింది ఈ నెంబర్ కు రూపాయలు పంపాలని,మీ ఫోన్ కు సమాచారం వస్తే మాత్రం తప్పకుండా పోలీసులకు సంప్రదించాలని తెలిపారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పండరి, రాజకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన
# తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు మైసయ్య యాదవ్



శివంపేట ఏప్రిల్ 28 (సమయం న్యూస్) : తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ యాసంగి వడ్ల కేంద్రాలు శివంపేట మండలం లో పలు గ్రామాల్లో చెన్నాపూర్ చిన్న గొట్టిముక్కల ఎదులాపూర్ చెంది గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు పరిశీలించడం జరిగింది రైతులకు కొనుగోలు కేంద్రాలు సమస్యలు ఉన్నాయని ఆయన అడిగారు అమాలి సమస్యలు అక్కడక్కడ కొద్దిగా కనబడుతున్నారు సరిగా అమాలీలను ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లో యాసంగి వడ్ల పంట చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని సన్న వడ్లకు 500 బోనస్ చెల్లించినట్టుగా దొడ్డు వడ్ల కూడా 500 బోనస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను సన్న వడ్లకు దొడ్డు రకం వడ్లకు కూడా 500 బోనస్ చెల్లించాలని రైతులకు పండించిన పంటకు కొద్దిగా లాభం ఉంటాదని మైసయ్య యాదవ్ అన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ జిల్లాలో అన్ని మండలాల కొనుగోలు కేంద్రాల్లో అమాలిని పెంచి రోజుకు ఒకటి నుండి రెండు లారీలు పంపితే ధాన్యము తొందరగా వెళ్లే అవకాశం ఉందని మైసయ్య యాదవ్ జిల్లా కలెక్టర్ గారిని కోరారు జిల్లాలో ఈ అకాల వర్షాలకు రైతులకు ఇబ్బందులు అయినందున మెదక్ జిల్లా కలెక్టర్ హమాలిని పెంచి రోజుకు ఒక కొనుగోలు కేంద్రంలో రెండు లారీల వరకు ధాన్యాన్ని పంపించే చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు రక్షణ సమితి మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షులు అక్క మొల్ల మైసయ్య యాదవ్ జిల్లా సంఘం తరపున జిల్లా రైతుల తరపున కలెక్టర్ గారిని కోరారు.

# ముమ్మరంగా స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ కోచింగ్ క్యాంప్స్

*** మే 1వ తేదీ నుండి జూన్ 6 వరకు 33 జిల్లాలలో స్పోర్ట్స్ అథారిటీ సమ్మర్ క్యాంపులు**



అంబర్ పేట, ఏప్రిల్, 28(సమయం న్యూస్) : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జంట నగరాల్లోని అన్ని స్టేడియాల్లో మరియు 33 జిల్లాలలో మే 1వ తేదీ నుండి జూన్ 6 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేన రెడ్డి తెలిపారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు 2025 పోస్టర్ రిలీజ్ మరియు క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు యువకులు క్రీడాకారులు విద్యార్థులు ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడా మైదానాల వైపు ఆకర్షితులయ్యే విధంగా ఈ వేసవి శిబిరాలు ఉన్న నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఉచితంగా యోగ మరియు జుంబా డాన్స్ లలో శిక్షణ ఇవ్వబోతున్నట్లు వివరించారు. గతంలో కంటే ఎక్కువ క్రీడాంశాలలో శిక్షణ ఇస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాకుండా కాకుండా గతంలో కేవలం జిల్లా కేంద్రాలకు పరిమితం అయినా ఈ వేసవి శిక్షణ శిబిరాలను ఈసారి పలు పట్టణ కేంద్రాల్లో కూడా నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేసవి శిబిరాల్లో వివిధ క్రీడాంశాల్లో అసిస్టెంట్ కోచులుగా సేవలందించే వారికి గౌరవ వేతనం పెంచబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొనబోతున్న క్రీడాకారులు విద్యార్థులను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలని వారి సమాచారాన్ని భవిష్యత్తులో క్రీడా అవసరాలకు వినియోగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ ప్రవేటు సంస్థలు అందించే వేసవి శిక్షణ శిబిరాలు పేద మధ్యతరగతి విద్యార్థులకు క్రీడాకారులకు అందుబాటులో లేకుండా ఉన్నాయని స్పోర్ట్స్ అథారిటీ అందించబోయే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు అందరికీ అందుబాటులోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనల మేరకు గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం ఇచ్చే విధంగా ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ముమ్మరంగా ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారుల సమాచారాన్ని నిక్షిప్తం చేస్తున్నామని ఆయన తెలిపారు. అసిస్టెంట్ కోచులుగా సేవలందించే వారి వివరాలను కూడా ఆన్ లైన్లో పొందుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి సోనీ బాలాదేవి డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ దర్గా షఫీ చమన్‌లో 75వ ఉర్స్ ఉత్సవాలకు రంగం సిద్ధం

బోధన్ పట్టణం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : బోధన్ పట్టణం లోని ప్రసిద్ధ దర్గా షఫీ చమన్‌లో 75వ ఉర్స్ ఉత్సవాలు వచ్చే నెల మే 3, 4, 5 తేదీలలో ఘనంగా నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా సజ్జదనషీ అబ్దుల్ బాకీ ఖాదిరి సోమవారం బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో ని కలిసి ఉర్స్ ఉత్సవాల సందర్భంగా మౌలిక వసతులకై ఒక మెమోరాండం అందజేశారు. ప్రతి సంవత్సరం లాగే, ఈ ఏడాది కూడా పండుగ సందర్భంగా భక్తుల కోసం మంచినీటి సదుపాయం, వీధి దీపాలు, మోరంలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గులాం ముజీబ్, షేక్ లతీఫ్, ఎండి ఉమర్ ఖాన్, ఎండి ముదస్సిర్ ఖాదిరి, ఇమ్రాన్ ఖాదిరి, మాజీ వైస్ చైర్మన్ హబీబ్ ఖాన్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, గయాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. బోధన్ ఉర్స్ ఉత్సవాలు భక్తులకు భక్తి, సామరస్యం, సేవాభావంతో కూడిన ప్రత్యేక కలిగిస్తాయనీ అన్నారు.

## జర్నలిస్టుగా జాతీయ స్థాయిలో
# అవార్డు అందుకున్న జాడ క్రాంతి కుమార్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28 సమయం న్యూస్: మీడియా రంగంలో సామాన్య పాత్రికేయుడిగా, నవసమాజ నిర్మాణం కోసం, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ, తనదైన శైలిలో వార్తా కథనాలతో ప్రజలను చైతన్యవంతులను చేయడంతో పాటు సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, జర్నలిస్టుల, ప్రజా సంక్షేమం, రక్షణే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తూ, ముఖ్యంగా కరోనా కాలంలో స్వచ్ఛందంగా ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రజల పక్షాన పలు పోరాటాలు నిర్వహించిన సామాన్య జర్నలిస్టు, తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన, టైమ్స్ ఆఫ్ వార్త తెలుగు దినపత్రిక రిపోర్టర్ జాడ క్రాంతి కుమార్ చేస్తున్న కృషిని గుర్తించి, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ అవార్డు 2025తో ఘనంగా సత్కరించారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి లోని ఆనం రోటరీ హాల్లో ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్ సరోజనమ్మ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతిని అదేవిధంగా సామాజిక సేవకురాలు షేక్ సమీరా ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని, నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రఖ్యాత కళాకారులు, సాహితీవేత్తల సమక్షంలో జర్నలిస్టుగా క్రాంతి చేసిన సేవలను గుర్తించి, ఆయనకు మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ అవార్డు 2025 అందించి, గౌరవించారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ మీడియా రంగంలో సామాజిక సేవ చేస్తున్న పాత్రికేయులకు జాతీయ ఉత్తమ జర్నలిస్టుల అవార్డు పురస్కారాలను ప్రదానోత్సవం చేస్తూ, వారికి అరుదైన గౌరవం అందిస్తున్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాలోని మందమర్రి పట్టణానికి చెందిన ఉదయక్రాంతి తెలుగు దినపత్రిక రిపోర్టర్ మహమ్మద్ ఖాసీం, తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన తెలంగాణ వాణి తెలుగు దినపత్రిక రిపోర్టర్ పిల్లి రవి కిరణ్ లకు సైతం మహాత్మ జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ అవార్డు 2025ను అందజేశారు. వీరితోపాటు సామాజిక సేవ రంగంలో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన కొండ సతీష్‌కు సైతం జాతీయ అవార్డును అందజేసి, అభినందించారు. ఇదే వేదికపై పలువురు కళాకారులు, పర్యావరణవేత్తలు, సామాజిక సేవకులు, వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురిని జాతీయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. జాతీయ అవార్డు అందుకున్న టైమ్స్ ఆఫ్ వార్త రిపోర్టర్ జాడ క్రాంతి కుమార్ మాట్లాడుతూ, తనకు మహాత్మ జ్యోతిరావు పూలే మహాత్ముని పేరు మీద మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని, జాతీయ అవార్డు ప్రధానం చేసిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ కు, మంచిర్యాల జిల్లా జర్నలిస్టుగా తనను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ, అండగా ఉన్న టైమ్స్ ఆఫ్ వార్త పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి, సహచర పాత్రికేయ మిత్రులకి, మిత్రులకు, కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు, ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ, ప్రజా, కుల, కార్మిక, విద్యార్థి సంఘాలకు, వివిధ రాజకీయ పార్టీలకు, ఎల్లప్పుడూ తన అండగా ఉంటూ, ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకున్న జాడ క్రాంతి కుమార్‌కు పలువురు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.



## సెక్యూరిటీ సిబ్బంది
## సమస్యలు పరిష్కరించండి

మందమర్రి, ఏప్రిల్ 28 సమయం న్యూస్: సింగరేణి సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు పలు సమస్యలతో బాధపడుతున్నారని, వారి సమస్యల పరిష్కారమయ్యేలా చూడాలని సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది కోరారు. ఈమేరకు సోమవారం సెక్యూరిటీ సిబ్బంది పట్టణంలోని సింగరేణి ఎస్ అండ్ పిసి కార్యాలయంలో సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవి భూమయ్య మాట్లాడుతూ, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ బి జనక్ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి, త్వరలోనే సెక్యూరిటీ సిబ్బంది సమస్యలను పరిష్కారం అయ్యేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సభ్యుడు కే జగన్నాథ చారి, నాయకులు వేణు, జంగా శ్రీనివాస్, ఎస్ అండ్ పిసి పిట్ కార్యదర్శి కేఆర్ సంపత్, నాయకుడు కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సిహెచ్ మురళి, పిట్ కమిటీ సభ్యులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉప్పులేటి నరేష్



మందమర్రి, ఏప్రిల్ 28 సమయం న్యూస్: ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఉప్పులేటి నరేష్ నియమితులయ్యారు. సోమవారం జిల్లాలోని శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో ఉప్పులేటి నరేష్‌కు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య నియామక పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా బాపయ్య మాట్లాడుతూ, అంబేద్కర్ యువజన సంఘం జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ఏకైక సంఘమని, దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో విస్తరించి, అణగారిన వర్గాలకు అండగా నిలిచేందుకు సంఘం కృషీ చేస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో సంఘం కమిటీని నిర్మాణం చేసేందుకు కమిటీలు నియమించడం జరుగుతుందన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాలను గ్రామ గ్రామాన తీసుకెళ్లేందుకు నరేష్ కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తనకు పదవి బాధ్యతలను ఇచ్చిన సంఘం జాతీయ అధ్యక్షుడు ఎస్ వరుణ్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కాడారం అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జిల్లా అధ్యక్షుడు నేరువట్ల రాజలింగులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని జిల్లాలో మరింత పటిష్టం చేసి, దేశ రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు, ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీల ఐక్యతకు కృషీ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ బొంకూరు మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్, కాంపెల్లి సతీష్, సీనియర్ నాయకులు రాజన్న, జిల్లా అధ్యక్షుడు నేరువట్ల రాజలింగు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆసంపల్లి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.



## ఏరియాను సందర్శించిన సిఎంఓ కిరణ్ రాజ్ కుమార్

మందమర్రి, ఏప్రిల్ 28 సమయం న్యూస్: సింగరేణి కార్పోరేట్ చీఫ్ మెడికల్ అధికారి (సిఎంఓ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కిరణ్ రాజ్ కుమార్ సోమవారం మొట్టమొదటిసారిగా ఏరియాను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియాలోని జిఎం కార్యాలయంలో ఆయనకు ఏరియా జిఎం జి దేవేందర్ ఘన స్వాగతం పలికి, మొక్కను బహుకరించి, శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం వెంకటరమణ, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియా స్టోర్స్ ఈ అండ్ ఎం డిజిఎం ఎస్ సురేష్, ఐటీ సీనియర్ ప్రోగ్రామర్ రవి, ఏరియా వర్క్ షాప్ డివైఎస్ఈ నరేష్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**తొర్రూరు, వంగర మండలాల్లో పర్యటన.**

తొర్రూరు, / వంగర ఏప్రిల్ 28(సమయం న్యూస్) : సోమవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే. వీరబ్రహ్మచారి రెవిన్యూ డివిజనల్ అధికారి గణేష్, సంబంధిత సిబ్బందితో కలిసి పెద్ద వంగర, మండల కేంద్రం, తొర్రూరు మండలం వెలికట్టే గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార శాఖ ఆధ్వర్యంలో నడిచే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి ప్యాడి క్లీనర్, మాయిశ్చర్ ధాన్యానికి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని వేసవికాలం నేపథ్యంలో కావలసిన మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, ధాన్యానికి సంబంధించిన రైతు యొక్క వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా వారి ఖాతాలలో జమ అయ్యే విధంగా సంబంధిత కేంద్రాల నిర్వహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం సూచించిన నామ్స్, సూచనలు ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని ఎప్పుడు ఎలా తీసుకురావాలో రైతులకు పూర్తి అవగాహన సంబంధిత వ్యవసాయ గ్రామస్థాయి అధికారులు కల్పించాలని సూచించారు. కొనుగోళ్లు కేంద్రాలలో రైతులకు సరిపడా గన్ని సంచులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కలెక్టర్ వెంట పిఎసిఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, స్థానిక తహసీల్దారులు కేంద్రాల నిర్వహకులు పాల్గొన్నారు.



## విద్యుత్ షాక్ తో ఆవు మృతి

జిన్నారం,ఏప్రిల్ 28, సమయం న్యూస్ : విద్యుత్ షాక్ తో ఆవ మృతి చెందిన ఘటన జిన్నారం మండలం మాదారం గ్రామ శివారులో సోమవారం జరిగింది. మాదారం గ్రామానికి చెందిన కురుమ శ్రీశైలం తన పశువులను ఏసంకుంట సమీపంలో మేత కోసం తీసుకువెళ్లాడు. కుంటలో పడిపోయిన విద్యుత్ సం బరం వైపు ఆవు మేత మేసుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు వైర్లకు తగలడంతో కరెంట్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెం దింది. బాధితుడు విద్యుత్, పశు వైద్యాధికారులకు సమాచారం ఇవ్వగా సంబంధిత అధికా రులు వచ్చి పరిశీలించారు. విద్యుత్ అధి కారుల నిర్లక్ష్యం వల్లనే ఈ ఘోరం జరిగిందని,తనకు ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

## రైతుకు హక్కుల భరోసా భూ భారతి

* **ఆర్థిక భరోసా ధాన్యం కొనుగోలు**
* **జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28 సమయం న్యూస్: ప్రభుత్వం రైతులకు వారి హక్కుల భరోసా భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో కల్పిస్తుండగా, ఆర్థిక భరోసాను ధాన్యం కొనుగోలుతో కల్పిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతిలాల్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నేటికి 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 85 కేంద్రాలతో 17019.320 టన్నుల ధాన్యాన్ని 2038 రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి, 97 లక్షల రూపాయలు చెల్లింపులు చేయడం జరిగిందని వివరించారు.



రైతులు పండించిన ధాన్యాన్ని శుభ్రం చేసి, కొనుగోలు కేంద్రాల వద్దకు సూచించిన మార్గదర్శకాల ప్రకారం తీసుకుని రావాలని కోరారు. జిల్లాలో ఇప్పటికీ 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయని, 85 కేంద్రాల్లో 17019 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు జియో ట్యాగింగ్ సైతం పూర్తి స్థాయిలో ముగించుకుని, నడుస్తున్న విషయం తెలిసిందే అని, ఈ పరిస్థితుల్లో డిసిఎంఎస్ ఈ రబీలో వుండవని గమనించాలని సూచించారు.

## బోధన్‌లో పేకాట స్థావరంపై దాడి

: **ఐదుగురు అరెస్ట్, నగదు, ఫోన్లు, వాహనాలు సీజ్**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని రుద్ర అపార్ట్మెంట్స్ వెనక డంపింగ్ యార్డ్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం సమయంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసు దాడి జరిగింది. ఈ దాడిని బోధన్ టౌన్ ఎస్‌హెచ్ఓ వెంకటనారాయణ స్వయంగా పర్యవేక్షించారు. ఎస్ఐ హబీబ్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిత దాడి నిర్వహించగా, అక్కడ ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారు. పోలీసులు వారి వద్ద నుంచి రూ.1,950 నగదు, 4 మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు. పేకాటపై నిరంతర నిఘా కొనసాగుతుందని, పేకాట ఆడడం నేరమని, ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తూ, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరుతున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో హున్నా గ్రామ విద్యార్థి సాయి చైతన్యకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు, సన్మానం



సంగారెడ్డి జిల్లా - ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గం సాలురా మండలం హున్నా గ్రామానికి చెందిన తుడిమే సాయిలు పద్మ దంపతుల కుమారుడు సాయి చైతన్య, విద్యారంగంలో రాష్ట్ర స్థాయిలో కీర్తి పొందాడు. సంగారెడ్డి జిల్లా హత్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చదువుతున్న సాయి చైతన్య 465 మార్కులతో రాష్ట్రస్థాయిలో నాల్గవ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, పార్లమెంట్ సభ్యులు రఘునందన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి సోమవారం ప్రత్యేకంగా సాయి చైతన్యను అభినందించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుతూ తన కృషి, పట్టుదలతో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థి ర్యాంకులు సాధించడం నిలవడం శుభప్రదమని, ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న సాయి చైతన్యను నాయకులతోపాటు, కళాశాల అధ్యాపకులు, పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు. గ్రామ స్థాయిలో చదువుతున్నా రాష్ట్రస్థాయిలో రాణించడమే కాక, ప్రభుత్వ విద్యా సంస్థల్లోనూ ప్రతిభ ఉందని చాటి చెప్పడం హర్షించదగ్గ విషయమని అన్నారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

* **రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్**

మందమర్రి, ఏప్రిల్ 28 సమయం న్యూస్: సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి వినతి పత్రం అందజేశామని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 11వ వేజ్ బోర్డు ప్రకారం పెన్షన్లు చెల్లించాల్సి



ఉండగా ఇప్పటివరకు పదవ వేతన సంఘం సిఫారసుల ప్రకారమే అతి తక్కువ పెన్షన్లు చెల్లిస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం వెంటనే స్పందించి, 11వ వేజ్ బోర్డ్ ప్రకారం రిటైర్డ్ కార్మికులకు పెన్షన్లు అందజేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి రిటైర్డ్ కార్మికునికి కనీసం పెన్షన్ పది వేల రూపాయలకు తక్కువ కాకుండా కనీస పెన్షన్ అందజేసేందుకు కృషి చేస్తున్న పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ కార్మికులకు సింగరేణిలో మిగిలిపోయిన క్వార్టర్లను కేటాయించాలని, ఇల్లు లేని వారికి సొంతిల్లు కల నెరవేర్చుకోవడానికి 250 గజాల స్థలాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు జక్కం రాజన్న, శనిగారపు రాజేష్, కోశాధికారి ఆసం కొమురన్న, చీఫ్ ఆర్గనైజర్ నాయిని శంకర్, సంయుక్త కార్యదర్శి పోలు సంపత్, నాయకులు ఎండి ఖలీల్, పి పీరయ్య, జెట్టి రవి, తులసి రామ్, సలహాదారులు కంబాల రాజనర్సు, తుంగపిండి శంకర్, కాల్వల లచ్చన్నలు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

: **జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

ఎడపల్లి మండలం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరై, భూ భారతి చట్టం ప్రయోజనాలను రైతులకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "భూ భారతి చట్టం ద్వారా రైతులకు భూమి సంబంధిత సమస్యలకు తక్షణ పరిష్కార మార్గం లభిస్తోంది," అని తెలిపారు. గతంలో భూ రికార్డుల్లో ఉన్న పొరపాట్లను సవరించుకోవడం, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వ భూముల క్లారిటీ, ఇతర భూ సమస్యల పరిష్కారానికి ఈ చట్టం కీలకంగా మారిందని చెప్పారు. ఇది సాధ్యమయ్యే విధంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలనీ, లేదా రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి మార్గదర్శకాలు అందిస్తారని సూచించారు. భూ భారతి చట్టం సెక్షన్లు, నియమాలు సులభంగా రైతులకు అందుబాటులోకి రావడం గొప్ప ప్రయోజనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, ఏడీఏ ప్రదీప్, ఎమ్మార్వో ధన్వాల్, వ్యవసాయ అధికారి సిద్ధి రమేశ్వర్, స్థానిక సొసైటీల చెర్మెన్‌లు



పోల మల్కారెడ్డి, మిద్దె నరేందర్, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతేకాక, భూ భారతి చట్టం ప్రయోజనాలు గ్రామీణ రైతులకు భూ సమస్యల పరిష్కారంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే అవకాశముందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ చట్టం వల్ల రైతులు భూమి పై పూర్తి హక్కుతో, రికార్డులు స్పష్టతతో కొనసాగించగలుగుతారు.

# భూ భారతిలో ప్రతీ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం

* **నాలుగు గోడల మధ్య స్వార్థ పూరితంగా తెచ్చిన చట్టం కాదు**
* **భూ భారతి రైతులకు శ్రీరామరక్ష**
* **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
* **అశ్వారావు పేటలోనిభూ భారతిపై అవగాహన సదస్సు**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 28(సమయం న్యూస్):భూ భారతి చట్టంలో ప్రతీ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధరణిలా ఇది నాలుగు గోడల మధ్య తెచ్చిన స్వార్థ పూరిత చట్టం కాదని రైతులకు భూ భారతి చట్టం శ్రీరామ రక్ష అని తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ భారతి 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ చట్టం చేసేముందు రైతుల కష్టం గురించి ఆలోచించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకొని రైతులకు శ్రీరామరక్షలా నిలిచే విధంగా భూభారతి 2025 చట్టాన్ని రూపొందించామని తెలిపారు. గతంలో నాలుగు గోడల మధ్య స్వార్థపూరితంగా తయారుచేసిన ధరణి చట్టానికి మూడేళ్లు గడిచినా నియమనిబంధనలు రూపొందించలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో తొలివిడత ప్రయోగాత్మకంగా అమలు చేసి అన్ని వివరాలు దరఖాస్తులు సేకరిస్తున్నామని జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలు పరిష్కరించి అర్హులైన వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పట్టాలుగా అందజేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు వివరించారు. భూ యజమానులకు న్యాయం జరిగేలా తహశీల్దార్ మొదలు కొని సీసీఎల్ఎ వరకు ఐదంచెల వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. సీసీఎల్ఎ వద్ద కూడా న్యాయం జరగలేదని భావిస్తే ట్రిబ్యునల్ ను ఆశ్రయించవచ్చన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైనన్ని ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీకల్లా రెవెన్యూ గ్రామ పరిపాలనాధికారులు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తప్పుచేసే అధికారులపై చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. గతంలో రైతు బంధు కోసం గులాబీ రంగు కార్యకర్తలకు భూమి లేకపోయినా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని సక్రమంకాని అటువంటి అక్రమాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు మరిన్ని సేవలు అందేలా రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందని ఏ పార్టీ కార్యకర్త అనే పక్షపాతం లేకుండా ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు చట్టం ఒక చుట్టంలా ఉపయోగపడేలా చూస్తామని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇతర శాఖ అధికారులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోధన్ కోర్టు చరిత్రలో మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణ

: **బెంచ్ వదలి న్యాయమూర్తి స్వయంగా తీర్పు ఇచ్చిన రోజు**

బోధన్ పట్టణం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని బోధన్ న్యాయస్థాన సముదాయంలో (కోర్టు) చరిత్రలో ఈ రోజు స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా నిలిచింది. ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి సాయి శివ బెంచ్ నుండి బయటకు వచ్చి న్యాయాన్ని స్వయంగా కల్పించిన అరుదైన ఉదంతం చోటుచేసుకుంది. రుద్రూర్ మండలం రాయకుర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు సాయమ్మ, గంగారాం వరకట్నం కేసులో కోర్టుకు హాజరయ్యారు. నడవలేని స్థితిలో ఉండటంతో, ఆటోలో కోర్టుకు చేరు కున్న దంపతుల పరిస్థితిని గమనించిన న్యాయమూర్తి చలించి పోయారు. దీనస్థితిలో ఉన్న వృద్ధులను







కోర్టు గదిలోకి పిలవకుండా, బెంచ్ వదిలి నేరుగా వారి వద్దకు వెళ్లి, కేసును సమీక్షించిన న్యాయమూర్తి, వారి పై ఉన్న కేసును కొట్టి వేసి, మానవత్వానికి మారుమచ్చగా నిలిచారు. ఈ ఘటన బోధన్ న్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మానవతా మూర్తిగా నిలిచిన న్యాయమూర్తి సాయి శివను పలువురు అభినందిస్తున్నారు. ఇలాంటి న్యాయమూర్తులు కోర్టుల పట్ల ప్రజల్లో నమ్మకం పెంచేలా పనిచేస్తారని స్థానికులు పేర్కొంటున్నారు.

# భూ యజమానులకు భూదార్ కార్డులు

* **పెండింగ్ సాధా బైనామా దరఖాస్తులు భూ భారతి తో పరిష్కారం**
* **సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి**

గజ్వేల్,ఏప్రిల్ 28: ప్రజలందరికీ ఆధార్ కార్డులు ఉన్నట్లుగానే భూ యజమానులకు భూధార్ కార్డులను తెలంగాణ ప్రభుత్వం అందించనున్నట్లు, పెండింగ్లో ఉన్న సాదా బయినామా దరఖాస్తులన్నీ కూడా భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసి లోని సమావేశ మందిరంలో గజ్వేల్ మండల రైతులు, ప్రజాప్రతినిధులకు భూ భారతి చట్టంపై జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి అవగాహన కల్పించారు. ముందుగా భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను జిల్లా అదనపు కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ



సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ భూ సమస్యలు ఎదుర్కొన్న విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మేధావులు, ప్రజలు, చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించి 14 ఏప్రిల్ 2025 తేదీ నాడు ఈ భూ భారతి చట్టం అమలులోకి తెచ్చిందన్నారు . పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, ఆర్డిఓ పై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసిసి అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరు మల్లారెడ్డి, ఆర్డీవో చంద్రకళ, మండల ప్రత్యేక అధికారి సువర్ణ, తహసిల్దార్ శ్రావణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తగ్గేల్లిలో అగ్ని ప్రమాదం

: **ఐదు ఎకరాల్లో ఈత చెట్లు దగ్ధం, రూ.2 లక్షల ఆస్తినష్టం**

సాలూరు మండలం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా సాలూరు మండలం తగ్గేల్లి గ్రామ శివారులో ఆదివారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అకస్మాత్తుగా చెలరేగిన మంటలు సుమారు ఐదు ఎకరాల పొలాల్లో నాటి ఉన్న ఈత చెట్లను పూర్తిగా దహనం చేశాయి. స్థానిక ప్రాంత ప్రజలు మంటలను గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే చెట్లు పూర్తిగా కాలిపోయి రూ.2 లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. ఈ ఘటనపై బాధితుడైన ఈత కార్మికుడు మల్లెపూల లక్ష్మణ్ మాట్లాడుతూ, "ఏడు తరాలుగా మా కుటుంబం ఈత చెట్లపై ఆధారపడి జీవిస్తోంది. ఇప్పుడు అవి కాలిపోవడంతో జీవనాధారం పోయింది. మా భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది" అని కన్నీటి గట్టుతో తెలిపారు. ప్రభుత్వ సహాయం కోరుతూ, బోధన్ ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ స్పందించి వెంటనే ఆర్థిక సాయం అందించాలని లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు కూడా బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందించాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పేద రోగులకు సేవలు అందిస్తేనే వైద్యునికి గుర్తింపు

* **రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య సేవలు అందించాలి**
* **కేఎన్ఆర్ యుహెచ్ఎస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి**

గజ్వేల్ ఏప్రిల్ 28: సమాజంలో అత్యంత ఆధరణ కలిగిన వైద్య విద్యకు మంచి భవిష్యత్తు ఉండగా, ప్రపంచంలో మరణం లేనిది విద్యా, వైద్యం మాత్రమేనని కాళోజి నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి డాక్టర్లకు సూచించారు. సిద్ధిపేట జిల్లా లక్ష్మక్క పల్లి ఆర్వీఎం మెడికల్ కళాశాలలో చైర్మన్ డాక్టర్ యాకయ్య అధ్యక్షతన జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో గ్రామీణ పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా రోగుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చక్కటి సేవలందిస్తే సమాజంలో గౌరవం గుర్తింపు దక్కుతుందని పేర్కొన్నారు. ఉన్నత లక్ష్యంతో పనిచేస్తున్న ఆర్వీఎం ట్రస్టు ప్రజలకు చక్కని వైద్య సేవలు అందిస్తూ ప్రజా వైద్యశాలగా గుర్తింపు తెచ్చుకుంటూ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని ప్రశంసించారు. అయితే వైద్య విద్య గ్రాడ్యుయేషన్ తో ముగియదని స్పష్టం చేస్తూ నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పరిశోధన, ఉత్తమ పద్ధతి, పురోగతితో జ్ఞానం, నైపుణ్యత పెంచుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. నిరంతరం వినూత్న విధానాలు, వ్యూహాలను అన్వేషిస్తూ సవాళ్లను అధిగమించడంపై దృష్టి పెట్టాలని, తద్వారా చక్కటి ఫలితాన్ని సాధిస్తారని తెలిపారు. నిరంతర విద్యార్థిగా గ్రాడ్యుయేట్ వైద్యులు భావిస్తూ ఆరోగ్య నిపుణుల సలహాలు స్వీకరించాలని ఆకాంక్షించారు. సాంప్రదాయ పద్ధతులు, ఆధునిక అభ్యసన విధానాలపై వైద్య విద్య ఆధారపడి ఉండగా, మెరికల్లాంటి శిక్షకులు, చక్కటి వసతులు, బోధన, నైపుణ్యత కలిగిన ఆర్వీఎం మెడికల్ కళాశాల అగ్రశ్రేణి వైద్యులుగా తీర్చిదిద్దుతున్న ఘనత దక్కించుకుంటున్నట్లు చెప్పారు. కాగా వైద్య విద్యార్థులు సురక్షిత, నియంత్రిత వాతావరణంలో క్లినికల్ నైపుణ్యత సాధించాలని ఆకాంక్షించారు. వైద్య విద్య, నాణ్యత, సామర్థ్య ఆధారిత విధానంపై ఆర్వీఎం దృష్టిసారించి అనతి కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నట్లు తెలిపారు. వైద్య విద్య ప్రమాణాలు, బోధన పద్ధతులు, నిష్ణాతులైన నిపుణులతో కూడిన మెడికల్ కళాశాలలు నెలకొన్న పోటీ తత్వంలో దూసుకెళ్తాయని, తల్లిదండ్రులు వాటిని గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. అయితే తమ పిల్లలు డాక్టర్లు కావాలో, మంచి డాక్టర్లుగా గుర్తింపు పొందాలో, తల్లిదండ్రులు ఎంచుకోవాలని కోరారు. సమాజ భవిష్యత్తును నిర్దేశిస్తున్న వైద్య విద్యతో ఆరోగ్యకర వాతావరణ నెలకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్ రెడ్డి, సీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





## కల్దుర్కీ గ్రామంలో పేకాట దాడి: పది మంది అరెస్ట్, నగదు, ఫోన్లు, బైకులు సీజ్

బోధన్ మండలం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని కల్దుర్కీ గ్రామంలో పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈ ఘటనపై బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి స్పందిస్తూ, విశ్వసనీయ సమాచారం ఆధారంగా పేకాట స్థావరంపై దాడి నిర్వహించామని తెలిపారు. ఈ దాడిలో పది మంది పేకాట రాయులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి 8 మొబైల్ ఫోన్లు, 2 బైకులు, రూ.6 వేల 6వందల నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని పేర్కొన్నారు. పేకాట స్థావరం పై తగిన ఆధారాలతో దాడి చేసినట్లు తెలిపారు. పేకాట ఆడడం నేరం అని ఎస్సై మచ్చేందర్ రెడ్డి స్పష్టం చేస్తూ, "ఎంతటి వారైనా పేకాట ఆడితే ఉపేక్షించం. చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు," అని హెచ్చరించారు. పోలీసుల చర్యపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

# అంగరంగ వైభవంగా శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం





బోధన్ పట్టణం, ఏప్రిల్ 28, సమయం న్యూస్ : నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కురుమల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప స్వామి కళ్యాణ మహోత్సవం బోధన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రోజున అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. ఉదయం నుండే ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కలశాలతో, మంగళహారతులతో, బోనాలను, నైవేద్యాలను భాజా భజంత్రీలతో ఆలయానికి తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. పౌరోహితులచే కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కురుమ సంఘ సంప్రదాయం ప్రకారం పలు కార్యక్రమాలను నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కురుమ సంఘం అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నిజామాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (నూడా) చైర్మన్ శ్రీ కేశ వేణు, ఉమ్మడి జిల్లాల సహకార సంఘం అధ్యక్షులు మరికంటి భూమన్న లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన అతిధులు మాట్లాడుతూ బోధన్ లో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళ్యాణానికి తమని ఆహ్వానించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ రానున్న రోజుల్లో కురుమ సంఘం నాయకులు అన్ని రంగాలలో రాణించాలని, పేద విద్యార్థులకు తన వంతు సహకారాలు అందిస్తానని అన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుకై తన వంతు ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. బోధన్ కురుమ సంఘ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి విచ్చేసిన అతిథులను, ప్రముఖులను ఘనంగా సన్మానించారు. కమిటీ తరఫున ఆలయానికి విచ్చేసిన భక్తుల కొరకై అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో బోధన్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు గోరెంచే వీరయ్య, ప్రధాన కార్యదర్శి కడికొల్ల శంకర్, కమిటీ సభ్యులు, నిజామాబాద్ జిల్లా కురుమ సంఘం కమిటీ, కార్యవర్గ సభ్యులు, జిల్లాకు చెందిన ప్రముఖులు, నియోజకవర్గ కురుమ కుల సంఘ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.



## ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించండి

* **జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.**

నిర్మల్ ఏప్రిల్ 28(సమయం న్యూస్): ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వంటి అంశాలపై ప్రజలు తమ సమస్యలను నివేదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని, శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తులకు సంబంధించి వివరాలను రిమార్కుల విభాగంలో స్పష్టంగా నమోదు చేయాలని, దరఖాస్తుదారులకు పరిష్కారం గురించి సమాచారం అందించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లాలో మారుమూల ప్రాంతాల ప్రజలకు సహాయార్థం ఏర్పాటు చేసిన టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి ఫోన్ కాల్స్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపించి తక్షణమే పరిష్కారం చేపట్టాలని సూచించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి, సమస్య నమోదుకు సంబంధించిన రసీదులను దరఖాస్తుదారులకు పంపించారు. ప్రజలు ఇంటినుంచే 9100577132 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేసి, వాట్సప్ ద్వారా దరఖాస్తులు పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దహిగూడ పంప్ హౌస్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా

ఆదిలాబాద్ ఏప్రిల్ 26(సమయం న్యూస్) : మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే త్రాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. సోమవారం ఫిప్పల్ దరి గ్రామ పంచాయితీ పరిధిలోని దహిగూడ పంప్ హౌస్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి మిషన్ భగీరథ నీరు అన్ని గ్రామాలకు సరఫరా అవుతున్నాయా, మోటార్లు సరిగా పనిచేస్తున్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా దహిగూడ పంప్ హౌస్ నుండి హత్తి గుట్ట, తిప్ప, లోహారా, ఖండాల , ఖానాపూర్, చిచ్ ధరీ , అల్లికోరి గ్రామాలకు నీటి సరఫరా జరుగుతున్నదని, వేసవి దృష్ట్యా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోతే ప్రత్యామ్నాయంగా రెండు బోర్ వెల్స్ మంజూరు చేస్తే మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు ప్రత్యామ్నాయం గా నీటి ఇబ్బంది ఉండదని ఎంపిడిఓ Aee RWS కలెక్టర్ కు విన్నవించారు. పంచాయితీ ద్వారా గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతున్నదని అన్నారు. యశ్వంత్ గూడ, రాజుగూడ, లోహరా బోర్ వెల్ ఏర్పాటు చేయుటకు మంజూరు చేయాలని తెలపగా జిల్లా కలెక్టర్ మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం పంప్ హౌస్ లో ఏర్పాటు చేసిన రిజిష్టర్ లో వాటర్ కు సంబంధించిన వివరాల నమోదును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ నాగేశ్వర్ రావు, మిషన్ భగీరథ AE rws ఆదిత్య, ఖండాల పంచాయితి సెక్రటరీ అనిల్, తదితరులు ఉన్నారు.

# 2028 నుంచి ఐపీఎల్‌లో 94 మ్యాచ్‌లు?



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌ను మరో 20 మ్యాచ్‌లకు విస్తరించాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు యోచిస్తోందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వెల్లడించారు. అయితే, ఇప్పట్లో కొత్త ఫ్రాంఛైజీలను ప్రవేశపెట్టే ఆలోచన లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఐపీఎల్ మీడియా హక్కుల కాలపరిమితి 2027 వరకు ఉంది. తదుపరి (2028) ఐపీఎల్ మీడియా హక్కుల సైకిల్ ప్రారంభంకానుంది. అప్పటి నుంచి 94 మ్యాచ్‌లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నాయని ఐపీఎల్ ఛైర్మన్ తెలిపారు. 'దీని గురించి ఐసీసీలో చర్చిస్తున్నాం. బీసీసీఐలోనూ అంతర్గత చర్చ జరుగుతోంది. ఫ్రాంఛైజీ క్రికెట్, టీ20 క్రికెట్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్‌లకు సంబంధించి అభిమానుల ఆసక్తి ఎలా మారుతోంది అనే విషయాలపై మేం మరింత లోతుగా చర్చించాల్సిన అవసరముంది. టోర్నీని విస్తరించాలంటే మ్యాచ్‌లను 74 నుంచి 84 లేదా 94కి పెంచాలి. ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో రెండేసి మ్యాచ్‌లు (సొంత మైదానంలో ఒకటి, ప్రత్యర్థి మైదానంలో ఒకటి) 94 మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంటుంది' అని అరుణ్ ధుమాల్ వివరించారు.

**ప్రస్తుతం అనుసరిస్తున్న విధానం ఇది**

ప్రస్తుతం ప్రతి సీజన్‌లో ప్లేఆఫ్స్‌తో కలిపి 74 మ్యాచ్‌లు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఆయా జట్లు గెలిచిన టైటిళ్ల సంఖ్య, ఫైనల్, ప్లే ఆఫ్స్ చేరిన సంఖ్య ఆధారంగా 10 జట్లకు సీడింగ్ ఇచ్చి రెండు గ్రూప్‌లుగా విభజించారు. ఒకే గ్రూప్‌లో ఉన్న జట్ల మధ్య రెండేసి మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ప్రత్యర్థి గ్రూప్‌లో తమతో సమానంగా ఉన్న జట్టుతో రెండుసార్లు... మిగతా జట్లతో ఒకసారి తలపడుతున్నాయి. ఉదాహరణకు ఈ సారి ముంబయి ఇండియన్స్, ఆర్సీబీ వేర్వేరు గ్రూప్‌ల్లో ఉండటంతో ఒకే సారి తలపడ్డాయి. ముంబయి, సీఎస్కే వేర్వేరు గ్రూప్‌ల్లో ఉన్నా.. సేమ్ సీడింగ్ (ర్యాంకు) ఉండటంతో రెండు మ్యాచ్‌ల్లో తలపడ్డాయి.



## స్టేడియంలో 19 వేల మంది పిల్లలు..
## నీతా అంబానీ, హార్దిక్ సెల్ఫీ!

ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా ముంబయి ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను 19 వేల మంది పిల్లలు ఉచితంగా వీక్షించారు. ముంబయి ఇండియన్స్, రిలయన్స్ ఫౌండేషన్ 'అందరికీ విద్య, క్రీడలు' అనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా వివిధ నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లలకు ఉచితంగా మ్యాచ్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేశాయి. మ్యాచ్ ముగిసిన అనంతరం ముంబయి ఇండియన్స్ యజమాని నీతా అంబానీ, కెప్టెన్ హార్దిక్ పాండ్య స్టేడియంలో ఉన్న పిల్లలతో సెల్ఫీ తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను ముంబయి టీమ్ సోషల్ మీడియాలో పంచుకుంది.




# అమ్మమ్మ చీరలో బుట్టబొమ్మ

తమిళ్ మూవీ 'ముగమూడి'తో సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. తెలుగులో ఒక లైలా కోసం, ముకుందా, సాక్ష్యం, గద్దలకొండ గణేశ్, మహర్షి, ఆచార్య రాధేశ్యామ్ వంటి కమర్షియల్ సినిమాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంది. ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్‌తో డీజే, అల వైకుంఠపురంలో చిత్రాలతో భారీ విజయాలను సొంతం చేసుకున్న ఈ బుట్టబొమ్మ.. యంగ్‌టైగర్ ఎన్టీఆర్‌తో అరవింద సమేతలోనూ మెరిసింది. అయితే ఈమధ్య కాలంలో టాలీవుడ్‌లో పూజా హెగ్డేకి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. ప్రస్తుతం ఈముద్దుగుమ్మ హిందీతో పాటు, తమిళ్ సినిమా ఇండస్ట్రీలో వరుస సినిమాలు చేస్తోంది. లేటెస్టుగా సూర్య ప్రధాన పాత్రలో, కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో వస్తున్న చిత్రం రెట్రో. ఈ యాక్షన్ లవ్ స్టోరీ మే 1న విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా రెట్రో లుక్‌తో పూజా హెగ్డే అలరిస్తోంది. 70 ఏండ్ల క్రితం చీర అంటూ తన అమ్మమ్మ శారీని కట్టుకుని ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. చీర కట్టుకు తగ్గట్లుగా సిగ్గు పడుతూ అందరి చూపు తన వైపు తిప్పుకుంది. ప్రస్తుతం ఈ పిక్స్‌నెట్టింట తెగ వైరల్‌అవుతున్నాయి. కాగా.. 4 తమిళ్ సినిమాలు, ఒక హిందీ సినిమా చేస్తూ బిజీగా ఉన్న ఈభామ.. త్వరలోనే తెలుగులోనూ రీ ఎంట్రీ ఇవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.





## పద్మ భూషణ్ అవార్డు అందుకున్న బాలకృష్ణ

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పురస్కారం అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల వేడుక జరిగింది. గణతంత్ర దినోత్సవం వేళ కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

**తెలుగుదనం ఉట్టిపడేలా..**

తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో 'పద్మ' అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు బాలకృష్ణ. దిల్లీలోని మాన్‌సింగ్ రోడ్డు నుంచి రాష్ట్రపతి భవన్‌కు కుటుంబంతో కలిసి ఆయన బయలుదేరిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు తనయుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి.. తండ్రి అడుగు జాడల్లో ప్రయాణించి నటుడిగా ప్రశంసలు దక్కించుకున్నారు బాలకృష్ణ. గతేడాది 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. పౌరాణికం, జానపదం, సాంఘికం, సైన్స్ ఫిక్షన్, బయోపిక్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసిన ఏకైక అగ్ర నటుడిగా ఆయన తెలుగు ప్రేక్షకుల మది దోచుకున్నారు. క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గా ఎంతో మందికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రకటించింది.

## మెగాస్టార్‌తో మూడోసారి?



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబోలో రానున్న మూవీ (మెగా157)పై ఇప్పటి నుంచే మంచి హైప్ క్రియేట్ అయ్యింది. సంక్రాంతికి వస్తున్నాం చిత్రంతో ఈ ఏడాది అనిల్ భారీ బ్లాక్‌బస్టర్ కొట్టడంతో అంచనాలు పెరిగిపోయాయి. ఇందులో చాలా ఏళ్ల తర్వాత చిరంజీవి ఈ సినిమాలో ఫుల్ లెంగ్త్ కామెడీ రోల్ చేయనున్నారనే టాక్‌తో మరింత క్రేజ్ ఉంది. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం లేడీ సూపర్‌స్టార్ నయనతారను మేకర్స్ సంప్రదించారని సమాచారం. ఈ రోల్ కోసం నయన్ రూ.18 కోట్ల రెమ్యునరేషన్ డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రజంట్ దీనిపై చర్చలు జరిగే అవకాశం ఉందట. అలాగే హీరోయిన్‌పాత్ర కోసం వేరే ఆప్షన్స్‌కూడా ఆలోచిస్తున్నట్లు సినీ వర్గాలు తెలిపాయి. మరోవైపు ఈ మూవీలో బాలీవుడ్‌నటి పరిణీతి చోప్రా కూడా నటించనున్నట్లు టాక్. జూన్‌లో షూటింగ్‌మొదలు కానుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈచిత్రాన్ని రిలీజ్‌చేస్తామని మేకర్స్ ఇప్పటికే కన్ఫర్మ్‌చేశారు. కాగా చిరంజీవి, నయనతార ఇప్పటికే గాడ్ ఫాదర్, సైరా నరసింహారెడ్డి సినిమాల్లో నటించిన విషయం తెలిసిందే.

# దానివల్లే అందరూ దూరం



ఇటీవలే టాలీవుడ్ స్టార్ హీరోయిన్ గా మంచి ఫేమ్ సంపాదించిన మీనాక్షి చౌదరి.. మొదట 'ఇచ్చట వాహనములు నిలపరాదు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యింది. హిట్ 2 చిత్రంతో భారీ విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత తెలుగులో వరుస ఆఫర్స్ అందుకున్న మీనాక్షి.. రీసెంట్‌గా లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతోనూ అలరించింది. వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న ఈ అమ్మడు కెరీర్‌గ్రాఫ్‌ఒక్కసారిగా పెరిగిపోయింది. ప్రస్తుతం యంగ్‌హీరో నవీన్ పోలిశెట్టితో కలిసి 'అనగనగా ఒక రాజు' మూవీలో నటిస్తున్న మీనాక్షి.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'నా చిన్నతనంలో ఇతరులతో మాట్లాడడానికి చాలా ఇబ్బంది పడేదాన్ని. ఎందుకంటే కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. దాని వల్లే నాతో చాలా మంది డిస్టెన్స్ మెయింటైన్ చేసేవారు. అప్పట్లో నా ఎత్తు నాకు సమస్యగా మారింది. అప్పుడప్పుడు చాలా బాధగా కూడా అనిపించేది. ఇక ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరిష్కరించుకో అని అన్నారు. దీంతో పుస్తకాలనే స్నేహితులుగా మార్చుకున్న. బుక్స్ చదవడంతో పాటు అందాల పోటీల్లో పాల్గొన్నాను. ఆటలపై కూడా ఆసక్తి కలిగింది. ఇండస్ట్రీలో వచ్చిన ప్రతి ఆఫర్ సద్వినియోగం చేసుకున్నాను. ఇండస్ట్రీలో ప్రతి చిన్న ఆఫర్ కూడా కచ్చితంగా ముందు కెరీర్‌ని నిలదొక్కుకునేందుకు సహాయపడుతుంది. సీనియర్ హీరోలతో నటించడానికి నాకు ఎలాంటి సమస్యలేదు. అది ఒక జోనర్‌గా భావిస్తాను' అని మీనాక్షి చెప్పుకొచ్చింది.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.